# 'రిఫరల్'లో అందని వైద్యం

- ఆర్యాపురం ఫస్ట్ రిఫరల్ ఆసుపత్రిలో అందని వైద్యం
- ఇబ్బంది పడుతున్న పేద మహిళలు
- పట్టించుకోని నగర పాలక సంస్థ



పేరుకే ఉచిత ఆయుర్వేద మందుల ప్రకటన



ఫస్ట్ రిఫరల్ యూనిట్‌లో నిరుపయోగంగా ఉన్న మంచాలు

**రాజమహేంద్రవరం సిటీ:** దశాబ్దాలుగా పేదలకు వైద్య సేవలు అందించిన ఫస్ట్ రిఫరల్ యూనిట్ నిర్లక్ష్యానికి గురైంది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఆసుపత్రిపై అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ప్రస్తుతం వైద్య సేవలు అందడం లేదు. దీంతో పేదలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆర్యాపురంలోని రిఫరల్ ఆసుపత్రి ఆరవై ఏళ్లగా ప్రజలకు వైద్య సేవలందించింది. ఇక్కడకు నగరంలో ఆర్యాపురం, కోటిలింగాల పేట, తుమ్మలావ, పేపర్ మిల్ తదితర ఏరియాల్లో ఉండే పేద, మధ్య తరగతి ప్రజలు నిత్యం 50 నుంచి 70 వరకు మహిళలు వైద్యసేవల వచ్చేవారు. ఈ ఆసుపత్రి సుఖ ప్రసవాలకు ప్రతీక నిలిచింది. అధిక శాతం గర్భిణులు ఈ రిఫరల్ ఆసుపత్రికే వచ్చేవారు.

**అధికారుల నిర్లక్ష్యం**

నగరపాలక సంస్థ ఎన్నికలు జరగకపోవడం, పాలక మండలి ఏర్పాటు కాకపోవడంతో అధికారుల ఇష్టారాజ్యంగా మారిపోయింది. ఆసుపత్రికి అవసరమైన వైద్యులు, వైద్య పరికరాలు, మందులు అందించే చర్యలు చేపట్టకపోవడంతో ఆసుపత్రిలో నామమాత్రపు సేవలందిస్తున్నారు. మహిళలకు మెటర్నటీ డాక్టర్ సేవలందించే డాక్టరు నియామకం లేకపోవడంతో వైద్యం దాదాపు కనుమరుగైపోయింది. సిబ్బంది అరకొరగా ఉంటూ నామమాత్రపు వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్యం అందకపోవడంతో స్థానికంగా పేద మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. . ఇదే ఆసుపత్రిలో వైద్య సేవలను అందించే అల్లోపతి వైద్యురాల్ని ఏర్పాటు చేయకుండా ఆయుర్వేద వైద్యాన్ని అందించేందుకు డాక్టరును నియమించారు. ఉచితంగా ఆయుర్వేద వైద్యం అందజేస్తూ ఉచిత మందులు అందిస్తామని ప్రకటించిన నగరపాలక సంస్థ ఇప్పుడు మందులు కూడా ఇవ్వడం లేదు. దీంతో ప్రజలు మండి పడుతున్నారు.

**ఆయుర్వేద మందుల్లేక..**

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నియమించిద్వా యుర్వేద డాక్టరుకు నగరంలో ప్రభుత్వ ఆసుపత్రిలో జీజీహెచ్ వైద్యులు పనితీరుపై పర్యవేక్షించేందుకు డిప్యూటీ కలెక్టర్‌తో విజిలెన్స్ కమిటీ సభ్యులుగా ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2023 సంవత్సరంలో ఆయుర్వేద వైద్యం అందించే చర్యలు చేపట్టగా తొలి విడతగా లక్ష రూపాయల మందుల కోసం అప్పటి కమిషనర్ దినేష్ కుమార్ నిధులు విడుదల చేశారు. అనంతరం ఇప్పటి వరకూ మరేవిధమైన నిధులు మంజూరు చేయక పోవడంపై వచ్చే రోగులకు ఆయుర్వేద మందులు ఉచితంగా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. గతంలో రోజుకు 40 మంది రోగులు ఆయుర్వేద వైద్యం కోసం వచ్చేవారు. ప్రస్తుతం ఐదు నుంచి పది మందిలో మాత్రమే ఆయుర్వేద వైద్యం కోసం వచ్చి మందులు లేకపోవడంతో నిరాశతో తిరిగి వెళ్లిపోతున్నారు. వైద్య సేవలు ఏమాత్రం చేయకపోవడంతో వారి కోసం ఏర్పాటు చేసిన మంచాలు నిరుపయోగంగా మారాయి.

### వైద్యం అందకపోవడం దారుణం



సుమారు 60ఏళ్ల నగరంలో ఫస్ట్ రిఫరల్ హాస్పిటల్‌గా అనేక మందికి సేవలందించారు. ఇప్పుడు ఈ ఆసుపత్రిలో మహిళలకు కనీసం వైద్యం అందంచకపోవడం దారుణం. అధికారులు నిద్రావస్థలో ఉన్నారనడానికి నిదర్శనం ఇదే. గర్భిణులు ప్రత్యేక వైద్య సదుపాయాలు కలిగిన ఆసుపత్రిగా పేరొందిన ఆసుపత్రిలో నగరపాలక సంస్థ అధికారులు వైద్య సేవలు అందించేందుకు ఏమాత్రం దృష్టి పెట్టకపోవడం విడ్డూరం. ప్రైవేట్ ఆసుపత్రులను ప్రోత్సహించేందుకు నగరపాలక సంస్థ పర్యవేక్షణ అధికారులు ఫస్ట్ రిఫరల్ ఆస్పటల్ బలహీనం చేసే చర్యలు చేపట్టడం దౌర్భాగ్యం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం

– నందం స్వామి, రాజమహేంద్రవరం

### మహిళలకు ఇబ్బందులు



స్థానికంగా ఫస్ట్ రిఫరల్ ఆస్పత్రిలో వైద్యం అందే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రావాలంటే ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించేలా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టాలి. పేదలు అత్యధికంగా నివసించే ఈ ప్రాంతంలో ఫస్ట్ రిఫరల్ ఆసుపత్రి సేవలు ఎంతో అత్యవసరం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తించి చర్యలు చేపట్టాలి.

– యామిని, స్థానిక మహిళ

## క్లుప్తంగా

### ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర



పూజలో పాల్గొన్న జక్కంపూడి రాజా

**సీటీఆర్ఐ:** నగరంలో నారాయణపురం కాలనీలోని ఉన్న సత్తెమ్మతల్లి అమ్మవారి 25వ జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవారికి పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అమ్మవారిని దర్శించుకున్నారు. నైవేద్యాలు సమర్పించారు. వైఎస్సార్ సీపీ ఏపీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వగృహం నుంచి పుట్టింటి పానుపు, అమ్మవారిని గరగల వాయిద్యాలతో తీసుకువచ్చారు. అనంతరం జక్కంపూడి రాజా కుటుంబ సభ్యులందరూ అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డ పద్మనాభం, ఆది విష్ణుమూర్తి, మానే దొరబాబు, అడపా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### ఇఫ్తార్ విందులో మాజీ ఎంపీ భరత్‌రామ్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎంపీ భరత్‌రామ్

**రాజమహేంద్రవరం సిటీ:** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా స్థానిక దానవాయిపేట మసీదులో ఆదివారం ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లాదయ అందరిపైనా ఉండాలన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

### ఆలయాలకు పోటెత్తిన భక్తులు



కడియపులంక ముసలమ్మ ఆలయం వద్ద భక్తులకు పంపిణీ చేస్తున్న ఉగాది పచ్చడి

**కడియం:** విశ్వావసు నామ సంవత్సరాదిని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని ప్రముఖ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రమైన కడియంలోని శ్రీ భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి, కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వర స్వామి, ముసలమ్మవారి ఆలయం, దుళ్లలోని వేంకటేశ్వర స్వామి తదితర ఆలయాలను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. ఆయా ఆలయాల వద్ద ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. మండల కేంద్రమైన కడియం దేవీచౌక్‌లో ప్రముఖ సిద్ధాంతి దొంతంశెట్టి కాళహస్తీశ్వరరావు పంచాగ శ్రవణం చేసారు. రాశుల వారిగా భవిష్యత్తును వివరించారు. ఆలయ కమిటీ, గ్రామస్తులు ఆయనను ఘనంగా సత్కరించారు.

### నేడు రక్తదాన శిబిరం

**కడియం:** అఖిల హరిత సంకల్పం సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు అధ్యక్షుడు గాద నాగేశ్వరరావు తెలిపారు. కడియపులంక నర్సరీ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి జరుగుతుందన్నారు.

### విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

**రాజమహేంద్రవరం సిటీ:** నగరంలోని వివిధ మున్సిపల్, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 223 మంది పేద విద్యార్థులకు యూనిఫాంలు, బ్లేజర్లు పంపిణీ చేసినట్లు రాజమహేంద్రి విద్యా సంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. రాజమహేంద్రి ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా ఉగాది సందర్భంగా సుమారు రూ.3 లక్షల విలువైన యూనిఫారమ్, బ్లేజర్స్ పంపిణీ చేశామన్నారు. ఆదివారం స్థానిక ఏపీ పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న శ్రీ కృష్ణసాయి కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. రాజమహేంద్రి విద్యాసంస్థల తరపున తేతలి స్వరూప్ రెడ్డి, తేతలి సత్య సౌందర్య, తేతలి మిత్రాక్షి మేఘన్ రెడ్డి పాల్గొన్నారు.

### ఘనంగా పుష్పోత్సవం

**బిక్కవోలు:** స్థానిక పార్వతి సమేత గోలింగేశ్వర స్వామి కల్యాణం పురస్కరించుకుని పుష్పోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పెళ్లి కుమారుడు, పెళ్లి కూతురుగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## హామీలు నెరవేర్చకపోతే చరిత్ర హీనులవుతారు



ఉగాది వేడుకల్లో పూజలు నిర్వహిస్తున్న భరత్‌రామ్ దంపతులు

- విశ్వావసు ఉగాది వేడుకల్లో మాజీ ఎంపీ భరత్ రామ్

**రాజమహేంద్రవరం సిటీ:** ఎన్నో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలోనైనా హామీలు నెరవేర్చాలని లేని పక్షంలో చరిత్రహీనులుగా మిగిలిపోతారని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ ధ్వజమెత్తారు. ఆదివారం నగరంలో మార్గాని ఎస్టేట్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఉగాది వేడుకలు నిర్వహించి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీ భరత్ దంపతులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బీసీ రాష్ట్ర నాయకులు మార్గాని నాగేశ్వరరావు దంపతులు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రజలందరికీ ముందుగా ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తొమ్మిదినెలలు దాటినా ఇంకా హామీలు నెరవేర్చక పోవడంతో ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతే చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. ఇప్పటికై నా చంద్రబాబు నాయుడు హామీలు అమలు చేయాలని ఆయన హితవు పలికారు.

### వ్యక్తి అదృశ్యం



కేసీ సాగర్ (పాతచిత్రం)

**రాజమహేంద్రవరం రూరల్:** ఇంటి నుంచి వెళ్లిన తన భర్త కనిపించడం లేదని మోరంపూడి వెంకటేశ్వరనగర్‌కు చెందిన సునీత ఆదివారం బొమ్మూరు పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మోరంపూడి వెంకటేశ్వరనగర్‌కు చెందిన డాక్టర్ కేసీ సాగర్ ఈనెల 29వ తేదీ ఉదయం ఇంటి నుంచి వెళ్లారు. అప్పటి నుంచి తిరిగి రాలేదని, అతని కోసం గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదని సునీత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథం కేసు నమోదు చేస్తున్నారు.

## వైభవంగా ఉగాది వేడుకలు

- అమ్మవారి ఆలయంలో భక్తుల పూజలు

**రాజమహేంద్రవరం రూరల్:** తొర్రేడు గ్రామంలోని ఒనువులమ్మ తల్లి ఆలయంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారి ఆలయాన్ని మామిడి తోరణాలతో, పూలతో అందంగా అలంకరించారు. గరగలతో, మేళతాళలతో అమ్మవారి ఆలయం చుట్టూ భక్తులు తలపై గరగలు పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ప్రధాన అర్చకులు సూర్యకుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు బాలాజీ బిల్డర్స్ వారు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం పంచాంగ శ్రవణం, లలిత సహస్ర పారాయణం చేశారు.



తొర్రేడులో ఒనువులమ్మ తల్లి ఆలయంలో గరగలతో భక్తులు

**దోసాలమ్మ ఆలయంలో పోటెత్తిన భక్తులు**

బొమ్మూరు గ్రామదేవత దోసాలమ్మవారి ఆలయంలో ఆదివారం ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పోటెత్తారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించుకున్నారు. అలయ కమిటీ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రసాద వితరణ చేపట్టారు.

**భక్తి శ్రద్ధలతో ఉగాది వేడుకలు**

**ధవళేశ్వరం:** మండలంలో ఉగాది వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయం, జనార్దన స్వామి ఆలయం, వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయం వద్ద స్థానిక నాయకులు యడ్ల మహేష్ ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు.

## ఈ ఏడాది అందరికీ మంచి జరగాలి



డాక్టర్ కర్రి రామారెడ్డిని సత్కరిస్తున్న ఎంపీ పురందేశ్వరి తదితరులు

**సీటీఆర్ఐ:** విశ్వావసు నామ సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, అందరూ ఆనందంగా జీవించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆకాంక్షించారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఎంపీ సారథ్యంలో స్థానిక జేఎన్ రోడ్డులోని ఎస్‌వీ ఫంక్షన్ హాలులో ఆదివారం ఉదయం ఉగాది ఉత్సవం జరిగింది. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డి, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ టీవీ నారాయణరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రాఘవేంద్రరావు, వీణా విద్వాంసులు సత్యప్రసాద్, మృదంగ విద్వాంసులు కె.యోగేష్, నాట్యాచార్య సప్పా దుర్గాప్రసాద్, యోగా గురువు దేవరపల్లి వీరరాఘవులు, స్వర్ణాంధ్ర కార్యదర్శి గుబ్బల రాంబాబు తదితరులకు పురస్కారాలను అందజేశారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, మాజీ ముఖ్యమంత్రి నటరత్న ఎన్టీఆర్ శతజయంతి పూర్తయిన నేపథ్యంలో రాజమండ్రికి చెందిన ఫొటోగ్రాఫర్ గరగ శ్రీనివాసరావు (చిన్ని శ్రీను) రూపొందించిన 'ఎన్టీఆర్‌కు నూరేళ్లు' పుస్తకాన్ని ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ తదితరులు ఆవిష్కరించారు. స్థానిక తిలక్ రోడ్డులోని రెడ్డి కన్వెన్షన్ హాలులో ఆదివారం రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పంచాంగ శ్రవణం ఏర్పాటు చేయించారు.

## సంస్కృతి, సంప్రదాయాలు తెలుగువారి సొత్తు

- బాధ్యత సంస్థ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు అందజేత



సేవా ప్రముఖులను సత్కరిస్తున్న బాధ్యత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరజాల బాబు తదితరులు

**కడియం:** సంస్కృతి, సంప్రదాయాలు తెలుగువారి సొత్తు అని బాధ్యత సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు బాబు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తన తండ్రి గిరజాల రామకృష్ణారావు పేరిట ఉగాది పురస్కారాలను అందజేశారు. బాబు మాట్లాడుతూ సమాజంలో సామరస్య వాతావరణం పెంపొందించేందుకు ఇటువంటి పండుగలను పూర్వీకులు ఏర్పాటు చేశారన్నారు. పొన్నవీరవెంకట మహేష్ శర్మ పంచాగ శ్రవణం చేశారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 12 మంది ప్రముఖులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. నేత్రవైద్య నిపుణులు యర్రా హేమలతాదేవి, తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ పండితులు ఖండవల్లి రాధాకృష్ణమాచార్యులు, ప్రముఖదాత సత్తి భాస్కరరెడ్డి (కందరెడ్డి), ప్రకృతి వైద్యులు శెట్టి సత్తిబాబు, తదితర ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. పురస్కార గ్రహీతలకు గిరజాల బాబు, రామకృష్ణ తులసి దంపతులతోపాటు, బాధ్యత సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, గిరజాల నాగేశ్వరరావు, తాడాల చక్రవర్తి, తిరుమలశెట్టి శ్రీనివాస్, వెలుగుబంటి అచ్యుతరామ్, ఊటుకూరి శైలజ, సాపిరెడ్డి సూరిబాబు, మద్దాల అను తదితరులు పాల్గొన్నారు.

**సాహితీ పురస్కారం అందుకున్న స్వామిప్రసాద్**



సంస్కృతిక పురస్కారం అందుకుంటున్న స్వామిప్రసాద్

**కడియం:** జేగురుపాడుకు చెందిన అభ్యుదయ సాహితీవేత్త, అభ్యుదయ రచయితీ సంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యులు గండి స్వామిప్రసాద్ సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల్లో కలెక్టర్ పి.ప్రశాంతి, శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కవితలు, సామాజిక వ్యాసాల ద్వారా తాను చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశారని స్వామి ప్రసాద్ స్థానిక విలేకరులకు తెలిపారు.

### నగరంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పథ సంచలన్ ఉత్సవం



పథ సంచలన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ సంఘ సేవకులు

**రాజమహేంద్రవరం సిటీ:** రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ స్వచ్ఛంద సామాజిక సేవా సంస్థ. సంఘం స్థాపించి వందేళ్లు పూర్తవుతున్న శుభతరుణంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఉగాది ఉత్సవం, పథ సంచలన్ యోజన ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ ప్రారంభకులు డాక్టర్ కేశవరావు బలిరాం హెడ్గేవార్ జన్మ దినం సందర్భంగా నగరంలో క్వారీ సెంటర్ శివాలయం వద్ద, ఉగాది ఉత్సవం, రాజమహేంద్రవరం నగరపుర వీధుల్లో పథసంచలన్ యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్, ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ డాక్టర్ కర్రి రామారెడ్డి, వెంకటేశ్వర ఫైనాన్స్ అధినేత రావిపాటి మధన గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక ఇబ్బందులు తాళలేక..



మృతి చెందిన మట్టపల్లి జయప్రకాష్

**రాజమహేంద్రవరం రూరల్:** ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బొమ్మూరు గ్రామం మురళీకొండపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం బొమ్మూరు మురళీకొండ ప్రాంతానికి చెందిన మట్టపల్లి విజయప్రకాష్(34) గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో ఓఎన్‌జీసీలో ట్రక్కు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి డ్యూటీ నుంచి బొమ్మూరులోని ఇంటికి వచ్చాడు. రాత్రి భోజనం చేసి గదిలోకి వెళ్లి పడుకున్నాడు. ఆదివారం తెల్లవారు జామున ఇంటికి ఆనుకుని ఉన్న వేపచెట్టుకు స్కార్ఫ్‌తో ఉరివేసుకుని విజయప్రకాష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని భార్య మట్టపల్లి షారోన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ జే.రాంబాబునాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జిత్ మోహన్ మిత్రా నూరేళ్లు ఇలాగే ఉండాలి

- జన్మదినోత్సవంలో ఉండవల్లి, హర్ష, రౌతు తదితరుల ఆకాంక్ష
- జిత్ మోహన్ మిత్రాకి ఘనంగా సత్కారం



జిత్ మోహన్ మిత్రాను సత్కరిస్తున్న మాజీ ఎంపీలు ఉండవల్లి, గెడ్డం, మాజీ ఎమ్మెల్యే రౌతు తదితరులు

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** అందరితో చనువుగా, ఆప్యాయంగా ఉంటూ క్రమశిక్షణ గల జీవనం సాగిస్తున్న జిత్ మోహన్ మిత్రా నిండు నూరేళ్లు ఇలాగే ఆనందంగా ఉండాలని మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణకుమార్, జీవీ హర్ష కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు ఆకాక్షించారు. నట గాయకుడు, ఆర్కెస్ట్రా పితామహుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్రా ఆర్కెస్ట్రా 55వ వార్షికోత్సవం, జిత్ మోహన్ మిత్రా 83వ జన్మదిన వేడుక, సంయుక్తంగా స్థానిక వై జంక్షన్ ఆనం రోటరీ హాలులో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమార్, హర్షకుమార్, రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ సినిమా పరిశ్రమతో సహా పలు రంగాల్లోకి వెళ్లినప్పటికీ ఎలాంటి వ్యసనాలకు లోను కాకుండా జిత్ క్రమశిక్షణతో మసలకున్నాడని అన్నారు. ఇదే విధానంతో శతవసంతాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ముద్రగడ ఏసుబాబు, నూజిళ్ల శ్రీనివాస్, పి.వి.ఎస్.కృష్ణారావు, నిమ్మలపూడి గోవిందు, జల్లి శివ ప్రసాద్, వి.జగపతి రావు, బి.సీతారామారావు, సుక్కిరెడ్డి శ్రీనివాస్, రవీంద్రనాథ్ గిరి, బి.ప్రసాద్, డా.బిక్కిన రామ్ మనోహర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కుడుపూడి పార్థసారధి, గౌరవ అధ్యక్షుడు మండె శ్రీరామ్ మూర్తి తదితరులు మాట్లాడారు. జిత్ మోహన్ మిత్రాను అతిథులు ఘనంగా సత్కరించగా, శ్రీపాద మిత్రకు గాయకులు, మిత్ర బృంద కమిటీ సభ్యులు, అభిమానులు, జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. తొలుత జిత్ మోహన్ మిత్రా ఆర్కెస్ట్రా 55వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ గాయకులు గణపతి భొట్ల రామనారాయణను మన్నాడే పురస్కారంతో ఆర్కెస్ట్రా తరపున సత్కరించారు. రామనారాయణ దంపతులను పలువురు పూలమాలలతో ముంచెత్తారు.

## క్రైస్తవులపై దాడులను అరికట్టాలి



కడియం శాంతి ర్యాలీలో మాట్లాడుతున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

**కడియం:** క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, క్రైస్తవుల హక్కులకు, మందిరాలకు, ఆస్తులకు, ప్రబోధకులకు రక్షణ కల్పించాలని, ప్రవీణ్‌పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కడియం మండల పాస్టర్స్ ఫెలోషిప్, ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్, కడియం మండలంలోని అన్ని క్రైస్తవ సంఘాలు ఆదివారం శాంతిర్యాలీ నిర్వహించాయి. స్థానిక ఎస్సీపేట అంబేద్కర్ సెంటర్ నుంచి కడియం పోలీస్‌స్టేషన్ వరకు ఈ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో సంఘాల నాయకులు కరుణాకర్, డీ. పరంజ్యోతి, కే. జయశీల్, బిషప్ సాలోమోన్, జీవరత్నం, శామ్యూల్‌రాజు, రత్నదీప్, కే. బుల్లియ్య, దళిత సంఘాల నాయకులు, ముస్లిం నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



శాంతిర్యాలీని చేస్తున్న క్రైస్తవులు

**కొవ్వొత్తుల నివాళి**

**రాజమహేంద్రవరం రూరల్:** ఆకస్మికంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆత్మకుశాంతి కలగాలని కోరుతూ రాజవోలు గ్రామంలో ఆదివారం సాయంత్రం క్రీస్తు కృపా చర్చి రెవ.పాస్టర్ పి.టాటావిక్టర్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. రాజవోలు సెంటర్ నుంచి క్రీస్తు కృపా చర్చి వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్రీస్తు కృపాసంఘం సభ్యులు పాల్గొన్నారు. బొమ్మూరులోని క్రీస్తు లూథరన్ చర్చిలో ఆదివారం పారిష్ సంఘకాపరి కె.అబ్షాలోమ్ ఆధ్వర్యంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆత్మశాంతి కలగాలని కొవ్వొత్తులతో నివాళులర్పించా రు. సంఘడెలిగేట్స్, సంఘ పెద్దలు, స్త్రీల సమా జం, యూత్, సండేస్కూలు పిల్లలు పాల్గొన్నారు.